# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
2. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు
3. వచ్చే ఏడాది జనవరి నుంచి రాజధాని అమరావతిలో పనులు మొదలవుతాయని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు.
4. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని శాఖల సమాచారం కోసం వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.
5. తెలంగాణ వ్యాప్తంగా గురుకుల వసతి గృహాల్లో ఆహార భద్రతకు ప్రత్యేక అధికారులను నియమించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ పనితీరుపై సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ముందస్తు నిర్బంధ చట్టం-పీడీ యాక్ట్, భూకబ్జా నిరోధక చట్టాలను ఉపయోగించి భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలన్నారు. భూముల రీ-సర్వేని పారదర్శకంగా నిర్వహించాలని, భూ ధ్రువీకరణపత్రాల కోసం ప్రజలు కార్యాలయాలకు రాకుండానే ఆన్‌లైన్ ద్వారా అన్ని పత్రాల జారీ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

--------------------------

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో ఇందిరమ్మ ఇళ్లపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేనివారు, పారిశుధ్య కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కేటాయింపుల్లో గ్రామ కార్యదర్శి, మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించడంతోపాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

వచ్చే ఏడాది జనవరి నుంచి రాజధాని అమరావతిలో పనులు మొదలవుతాయని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. రాజధాని పరిధిలో సంస్థలకు భూ కేటాయింపులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం నిన్న రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ, గతంలో పాత సంస్థలకు రాజధానిలో కేటాయించిన భూములకు అప్పటి ధరలే వర్తిస్తాయని చెప్పారు. రాజధానిలో నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియను డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 30 సెకన్లు )

---------------------------

ప్రజా సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఆ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గుంటూరుజిల్లా తాడేపల్లిలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిన్న ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నుంచి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. “కార్యకర్తలతో జగనన్న, పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం” పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జగన్మోహన్ రెడ్డి వెల్లడించారు.

---------------------------

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఔషద పరిశ్రమల ఏర్పాటు కోసం లగచర్లలోని 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూసేకరణ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. స్థల సేకరణ అంశంలో నెలకొన్న ఘర్షణల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

---------------------------

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్య గణనను చేపట్టిందని యువజన వ్యవహారాల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

..వాయిస్... 31 సెకన్లు..

---------------------------

పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విజయవాడకు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ రాజ్‌భవన్‌లో గత రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్, ముఖ్యమంత్రి పలు విషయాలపై చర్చించారు. రామ్ నాథ్ కోవింద్ రెండ్రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడకు కుటుంబసభ్యులతో పాటు వచ్చిన మాజీ రాష్ట్రపతి... రాజ్‌భవన్‌లో బస

చేశారు. ఇది ఇలా ఉండగా గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఈరోజు జరిగే ఒక ప్రయివేటు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో రామ్ నాథ్ కోవింద్ పాల్గొంటారు.

---------------------------

రాష్ట్రంలోని అన్ని శాఖలకు సంబంధించిన సమాచారం ప్రజలకు, పాత్రికేయులకు అందుబాటులో ఉంచేలా కేంద్రీకృత వెబ్ పోర్టల్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన మొదటి విడతలో భాగంగా 8 లక్షల గృహాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. త్వరలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-2.0 పథకాన్ని ప్రారంభిస్తున్నామని, దీని కింద కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి, అయిదేళ్లలో పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా గురుకుల వసతి గృహాల్లో ఆహార భద్రతకు ప్రత్యేక అధికారులను నియమించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో మంత్రి నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఆహారం విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురుకుల వసతి గృహాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ దేశం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనుందని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆ దేశ రాయబారి రువెన్ అజర్‌తో ఆయన నిన్న సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, సైబర్ భద్రతలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని.. ఆ రంగాల్లో తెలంగాణకు సహకరించాలని కోరామని మంత్రి చెప్పారు. వ్యవసాయం, నీటి వినియోగంలో ఆధునిక సాంకేతికత, నూతన పరిశోధనలు, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాటును అందించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు రువెన్ అజర్ సానుకూలంగా స్పందించారని మంత్రి వివరించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారినట్లు అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. దీనికి ఫెంగల్‌గా నామకరణం చేశారు. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు మధ్యాహ్నానికి పుదుచ్చేరి తమిళనాడు మధ్యలో తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు సోమవారం వరకు వేటకు వెళ్లరాదని సూచించింది. రాష్ట్రంలోని కృష్ణపట్నం పోర్టుకు మూడో నంబరు, విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కాకినాడ, గంగవరం పోర్టులకు రెండో నంబరు హెచ్చరికలు జారీ చేశారు.

తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం. తెలిపింది. ఈరోజు

ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

"దేశమంటే మట్టికాదోయ్– దేశమంటే మనుషులోయ్" అంటూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీకారులు ప్రముఖ రచయిత మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి ఈ రోజు. 1862 సెప్టెంబర్ 21వ తేదీన విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో ఆయన జన్మించారు. గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం తెలుగు నాట అత్యంత ప్రసిద్ధి పొందింది. తన రచనలద్వారా సాంఘిక పరివర్తనకు విశేష కృషిచేసిన గురజాడ అప్పారావు 1915 నవంబర్ 30న తుది శ్వాస విడిచారు.

======================